క్లుప్తంగా

నేడు విశ్వకర్మ పథకంపై అవగాహన

కైలాస్‌నగర్: కులవృత్తులపై ఆధారపడి జీవించే వారి కోసం కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై ఈనెల 23న హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎంఈ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లాలోని 18 చేతి వృత్తుల కళాకారులు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుండెపోటుతో మాజీ ఎంపీటీసీ మృతి

ఇంద్రవెల్లి: గుండెపోటుతో మాజీ ఎంపీటీసీ మృతి చెందిన ఘటన గురువారం మండల కేంద్రంలోని బుద్ధనగర్‌లో చోటు చేసుకుంది. కుటుంబికులు, గ్రామ ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం.. బుద్ధనగర్ కాలనీకి చెందిన భవాలే శీలానంద్ 2001 నుంచి 2005 వరకు ఎంపీటీసీగా పని చేశారని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడన్నారు. అకస్మికంగా రాత్రి గుండెపోటు రావడంతో ఇంట్లోనే మృతి చెందినట్లు తెలిపారు. మృత్యుడికి భార్య దీప, ఇద్దరు కూతురులున్నారు. మాజీ ఎంపీటీసీ గుండెపోటుతో మృతి చెందడంతో బుద్ధనగర్‌లో విషాద ఛాయలు అములుకున్నాయి.

మార్కెట్ కమిటీ చైర్మన్‌ను కలిసిన అధికారి

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బొడ్డు గంగారెడ్డిని జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్ గురువారం బోథ్‌కు మార్కెట్ కమిటీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు బత్తుల రమేశ్, విజయ భాస్కర్ రెడ్డి, గడ్డల నారాయణ, రవి చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో బలరాం జాదవ్

బోథ్: బోథ్ మండలంలోని కుచులాపూర్ గ్రామంలో శ్రీసద్గురు శబరిమాత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర అధ్యాపక సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ గురువారం హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శబరిమాత భక్తులకు ఎలాంటి సహాయ సహకారలైన అందించేందుకు ముందుంటానని తెలపారు. రామ భక్తురాలిగా శబరిమాత నడిచిన మార్గంలోనే ప్రజలు నడవాలన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

24 నుంచి సోయాబీన్ కొనుగోలు ప్రారంభం

జైనథ్: రైతుల వద్ద నుంచి సోయాబీన్ పంటను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీసీసీబీ డైరెక్టర్, జైనథ్ పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. క్వింటాలుకు రూ. 4,600 చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 24 నుంచి మార్చి 5వ రకు అనుమతించిన్నట్లు పేర్కొన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: సహకార శాఖ జిల్లా నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2024 సంవత్సర డైరీలను జిల్లా సహకార అధికారి బి.మోహన్ ఆవిష్కరించారు. సహకార శాఖ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సంఘ బాధ్యులతో విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.నవీన్ కుమార్, కార్యదర్శి సి.విక్రాంత్, సభ్యులు సుజాత, లక్ష్మి, సంజయ్, రజిత, వినయ్ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో నిర్వహించే ప్రతీ పండుగలో హిందూ, ముస్లింలు పరస్పరం సహకారం అందించుకుంటూ మత సామరస్యతను చాటుతున్నారు. ఇందులో భాగంగా గురువారం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛందంగా ముస్లిం సోదరులు పాల్గొని మతసామరస్యతను చాటారు.

కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఖానాపూర్: కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. గురువారం ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఖానాపూర్ మండలానికి చెందిన మెస్రం నర్స, మెస్రం హరి, చిలుకూరి మురళి, కొంపల్లి లత కాంగ్రెస్‌లో చేరారు.

అమ్మో దుర్గంధం



నార్నూర్: మండలంలోని పారిశుధ్యం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. మండలంలోని కొత్తపల్లి(హెచ్) తండాలో డ్రెయినేజీలు శుభ్రం చేయకపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. దీంతో లార్వా వృద్ధి చెందడంతో పాటు దోమలు స్వైర విహారం చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. సాయంత్రం ఐదు దాటితే ఇంటి ముందు కూర్చోవాలన్నా.. దోమల బెడద తట్టుకోలేకపోతున్నామని వాపోతున్నారు. డ్రెయినేజీల్లో మురుగునీరు, పిచ్చి మొక్కలు భారీగా పెరగడంతో దుర్వాసన తప్పడం లేదు. అధికారులు స్పందించకపోతే డెంగ్యూ మలేరియా వంటి వ్యాధుల బారిన ప్రజలు పడే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీలు శుభ్రం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదకర గుంత



బోథ్: మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద అంబేద్కర్ కాలనీకి వెళ్లే దారిలో కల్వర్టు వద్ద గుంత పడింది. గుంతపడి నెలలు గడుస్తున్నా.. అధికారులు స్పందించడం లేదు. అటువైపుగా వెళ్లే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదు. స్థానిక యువకుడు బోనగిరి క్రాంతి ప్రమాదం జరగకుండా ఎవరూ గుంత వైపు వెళ్లకుండా చుట్టూ రాళ్లను పేర్చారు.

ఎల్లమ్మతల్లి నాటక ప్రదర్శన

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి)లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎల్లమ్మ నాటక ప్రదర్శన గురువారం రాత్రి ముగిసింది. గత రెండు రోజులుగా గ్రామంలోని ఆలయ సమీపంలో కనక దుర్గ ఎల్లమ్మ నాటక బృందం సభ్యులు నాటకాన్ని ప్రదర్శించారు. చివరి రోజు పాత్రధారులు రక్తి కట్టించి ఎల్లమ్మ, జమదగ్ని, మహర్షి వేషధారణలతో పాత్రలో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు దత్తు, బక్కి కల్యాణ్, వినయ్, నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న డ్రెయినేజీ నిర్మాణానికి గురువారం జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు భూమిపూజ చేశారు. జెడ్పీ నిధుల నుంచి రూ.5 లక్షలతో నిర్మించే డ్రెయినేజీ పనులను గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ నిధులతో మండలంలోని పలు గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం జెడ్పీ నిధులు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రఘు, నాయకులు అశోక్, రమణ, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ తండాను అభివృద్ధి చేస్తా



మాట్లాడుతున్న ఆడే గజేందర్

నేరడిగొండ: నియోజకవర్గంలోని ప్రతీ గూడెంతో పాటు ప్రతీ తండాను అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండలంలోని రోల్‌మామడ గ్రామాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో గూడెంలు, తండాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. సమావేశంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆడే వసంతరావు, కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్ రెడ్డి, బోథ్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, షేక్ రజియా బేగం, కుర్మే మహేందర్, మేరాజ్, సాయన్న, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారిని కృష్ణవేణి

బజార్‌హత్నూర్: నేటి సామాజిక వ్యవస్థలో మహిళలు ప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా మహిళా సాధికారత ప్రత్యేకాధికారిని కృష్ణవేణి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఐకేపీ భవన్‌లో సహజ్యోతి మండల మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో పోటీపడుతూ ముందుకు సాగాలన్నారు. బాలల హక్కుల గురించి తెలుసుకుని బాల్య వివాహాలను, బాల కార్మిక వ్యవస్థను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గణేష్, తొట్ల శంకర్, కోటేశ్వర్‌రావు, నిఖిల్, పురుషోత్తం, జమున, ప్రగతి, నారాయణ, గంగయ్య పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి



మాట్లాడుతున్న జైవంత్‌రావు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అధికారులకు సూచించారు. గురువారం ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయితీ కార్యదర్శులు, మండల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. వేసవి కావడంతో గ్రామాల్లో, పట్టణ కేంద్రాల్లో నీళ్లటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు ఎప్పటికప్పుడు దృష్టి సారించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ 15 రోజులుకోసారి సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎంపీడీవో మురళీధర్ శర్మ, ఎంపీవో లింగయ్య, ఆర్‌డబ్ల్యూఎస్, మండల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడలతో బంగారు భవిష్యత్



బహుమతులు ప్రదానం చేస్తున్న జెడ్పీటీసీ

తలమడుగు: క్రీడలతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దేహగామా గ్రామంలో 20 రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి గెలుచుకున్న మహారాష్ట్రలోని జవర్ల టీంకు రూ. 15 వేలు, ద్వితీయ బహుమతి పల్సి(బీ) క్రీడాకారులకు రూ. 10వేలు అందజేశారు. క్రీడాలతో మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు. అంతేకాకుండా క్రీడలతో స్నేహ భావం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో త్రియంబక్, రఫీక్, పోశెట్టి, గోపాల్, లస్మన్న, భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి ప్రత్యేక కృషి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

సిరికొండ: సిరికొండ మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. రహదారి, విద్య, వైద్యం అన్ని రంగాల్లో సమస్యలు పరిష్కరించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తానని పేర్కొన్నారు. కొండాపూర్ వద్ద వంతెన పనులను సైతం పరిశీలించారు. ఆయన వెంట ఎంపీపీ అమృత్‌రావు, జెడ్పీటీసీ చంద్రకళ, కాంగ్రెస్ కన్వీనర్ హిమామ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'రైతులపై దాడి సరికాదు'

ఖానాపూర్: పంటలకు మద్దతు ధర చట్టం అందించాలనే డిమాండ్‌తో ఆందోళన చేస్తున్న పంజాబ్, హరియాణా రైతులపై పోలీసులు దాడులు చేయడం అత్యంత హేయమైన చర్య అని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు, ఐఎఫ్ టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్ అన్నారు. గురువారం పట్టణంలో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ దాడిని సీపీఐ(ఎంఎల్) తరఫున ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కాల్పులకు దిగిన పోలీసులపై హ త్యానేరం కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు.

మోసాలకు దూరంగా ఉండాలి

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత యువత ఆన్‌లైన్ మోసాలకు దూరంగా ఉండాలని ఎస్సై దుబ్బక సునీల్ అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని దనోరా(బి) గ్రామానికి సందర్శించి యువత, ప్రజలతో సమావేశం నిర్వహించారు. సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ టెక్నాలజీ యాప్‌లపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారానే నేరాలు ఎక్కువ జరుగుతున్నాయన్నారు. ఎలాంటి సమస్య ఉన్న వెంటనే పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర టీచర్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్ ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో కలిసి సత్కరించారు. ఈసందర్భంగా పుష్పగుచ్చాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రామగిరి శివకుమార్, ప్రధాన కార్యదర్శి సల్ల సురేందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, హేమంత్ జాడే, విద్యాసాగర్, కుషాల్ జాడే, గజానన్ పాల్గొన్నారు.

డీఎంఈని కలిసిన రిమ్స్ డైరెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యూకేషన్ (డీఎంఈ) డాక్టర్ వాణిని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల ఆమె డీఎంఈగా బాధ్యతలు చేపట్టగా గురువారం హైదరాబాద్‌లోని డీఎంఈ చాంబర్‌లో కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా రిమ్స్‌లోని ఖాళీలు, తదితర విషయాలపై చర్చించారు.

సన్మానం

నేరడిగొండ: బోథ్ ఏఎంసీ ఉపాధ్యక్షుడిగా ఆడే వసంత్‌రావు నియామకం కావడంతో గురువారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో వడూర్‌కు చెందిన యువకులు ఘనంగా సన్మానించారు. బోథ్ మార్కెట్ పరిధిలోని రైతులకు ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని కోరారు. రైతులకు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని ఆడే వసంత్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ నాయకులు సయ్యద్ ఇసాఖొద్దీన్, షేక్ ఆరీఫ్, షేక్ రహీమ్, షకీల్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రేపు అన్నదానం

నేరడిగొండ: మండలంలోని రోల్‌మామడ గ్రామ సమీపంలోని 1008 గురుసాహేబ్ బంజారా అన్నదాన మహాప్రసాద కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు మథుర లబాన కులస్తులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మధ్యప్రదేశ్‌కు చెందిన చందర్‌సింగ్ మహరాజ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మెస్రం రూప్‌దేవ్

నార్నూర్: మండలంలోని మాన్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాజులగూడ గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి గురువారం మాజీ ఎంపీపీ, పటేల్ మెస్రం రూప్‌దేవ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టే సీసీరోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లోఖండే దేవురావు, గోవింద్, హైమద్, కాంట్రాక్టర్ మోతిరాం, తదితరులు పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం తొలివిద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి నిర్వహించారు. మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిన్నంసత్యం, నాయకులు హాజరై ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో షబ్బీర్ పాషా, శివరాజ్, మణిరాం, ఖలీల్, పరిమి సురేశ్, సలీంఖాన్, నిమ్మల రమేశ్, రఫీ, అఫ్సర్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్ గ్రామంలో నిర్మించే సీసీ రోడ్డు పనులకు గురువారం కాంగ్రెస్ మున్సిపల్‌ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నిమ్మల రమేశ్, చంద్రయ్య, తోట సత్యం, కంటం రవీందర్, రాజేశ్వర్, రాజు, రాజేందర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఈశ్వరీబాయి

నేరడిగొండ: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి అన్నారు. మండలంలోని బుగ్గారం గిరిజన గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పరీక్షలు సమీపిస్తున్న వేళ భయం వీడి పరీక్షల కోసం సన్నద్ధం కావాలని సూచించారు. పరీక్షల సమయం దగ్గర పడుతుందని, చదువులో వెనుకబడిన పదో తరగతి విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఆదేశించారు. మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలు, వంట సరుకులు, విద్యార్థుల మధ్యాహ్న భోజనం, హాజరు శాతం పరిశీలించారుజ. ఆమె వెంట ప్రిన్సిపాల్ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్స్ స్రవంతి, మహేశ్వరి, వార్డెన్ అరుణ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



హాజరైన భక్తులు

తాంసి: భీంపూర్ మండలం పిప్పల్‌కోటి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన వేంకటేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడు రోజులుగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు కార్యక్రమాలు చేపట్టారు. చివరి రోజు శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను గ్రామస్తులు డప్పుచప్పులతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి, బలిరాం జాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నందయ్య, నిపాని ఆలయ మహరాజ్ శివదత్తగిరి మహరాజ్, మాజీ సర్పంచ్ గంగయ్య, గ్రామ పెద్దలు రాంరెడ్డి, నర్సింగ్, లస్మన్న పాల్గొన్నారు.

పరీక్షలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న పరీక్ష నిపుణులు

తలమడుగు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం పోటీ పరీక్షల నిపుణులు అల్లం సాయికృష్ణ, రమణగౌడ్ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఒత్తిడికి గురి కాకుండా పాటించాల్సిన నియమాలను వివరించారు. చదివే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరీక్ష హాల్‌లో పాటించాల్సిన నిబంధనలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ రావ్, పాఠశాల హెచ్ఎంసీ చైర్మన్ గంగన్న, ఉపాధ్యాయులు రాజేందర్, లలిత, వినోద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి



భూమిపూజ చేస్తున్న మందుల రమేశ్

నేరడిగొండ: ఉపాధిహామీ నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను నాణ్యతతో చేపట్టాలని కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్ అన్నారు. గురువారం కుమారి గ్రామంలో ఉపాధిహామీ నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో చేపడుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మిస్తేనే నాయకులకు మంచి పేరు ఉంటుందన్నారు. ఒకవేళ నాసిరకంగా నిర్మిస్తే అధికారులు బిల్లులు చెల్లించొద్దన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఓర్స రాజు యాదవ్, బీఆర్ఎస్ నాయకులు హనుమయ్య, కమలాకర్ రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బోథ్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని కనుగుట్ట గ్రామంలో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు నవ్వ రవి, రమేశ్, బొడ్డు శ్రీనివాస్, అలకొండ ప్రశాంత్, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్, కుమ్మరి వంశీ, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.